పరిహారానికి గ్రహణం..!

ఏనుగుల వరుస దాడులకు తీవ్రంగా నష్టపోయిన అన్నదాతలకు అందాల్సిన పరిహారానికి గ్రహణం పట్టింది. రైతులు నెలల తరబడి పరిహారం ఎప్పుడిస్తారా ? అని కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు. అయితే ప్రభుత్వం కానీ.. అటవీశాఖ అధికారుల నుంచి స్పందన లేకపోవడంతో రైతులకు పరిహారం అందించే విషయంలో ఆశలు సన్నగిల్లుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఏనుగుల దాడిలో పంట నష్టపోయిన తమకు పరిహారం ఇచ్చేందుకు చొరవ చూపాలని కోరుతున్నారు.




ఏనుగుల దాడిలో ధ్వంసమైన బోరు(ఫైల్), ఏనుగుల దాడిలో మృతి చెందిన దూడను పరిశీలిస్తున్న అటవీ అధికారులు(ఫైల్)

- ఏనుగుల దాడుల్లో తీవ్రంగా పంటలు నష్టపోయిన అన్నదాతలు
- పరిహారం కోసం నెలల తరబడి ఎదురుచూపులు
- కనీసం చికిత్స ఖర్చులు కూడా అందించని వైనం
- కాగితాలకే పరిమితమైన హామీలు
- ముఖం చాటేస్తున్న అటవీశాఖ అధికారులు



ఏనుగుల దాడిలో ధ్వంసమైన వరి పంట(ఫైల్)

యాదమరి: మండలంలోని గ్రామాల్లో ఏనుగుల గుంపు వరి, మామిడి, అరటి, వ్యవసాయ బోర్లను ధ్వంసం చేశాయి. మూగ జీవాలను సైతం బలిగొన్నాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఏనుగులు దాడి చేసినప్పుడు మాత్రం బాధిత రైతులను పరామర్శించి న్యాయం చేస్తామన్న అటవీశాఖాధికారులు ఇప్పుడు మొహం చాటేస్తున్నారు. వారిచ్చిన హామీలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయి. నాడు అటవీ శాఖ ఉన్నతాధికారి రైతులకు పరిహారం అందించే విషయంలో చెప్పిన మాటలు ఒక్కటీ ఆచరణకు నోచుకోలేదు. మరో వైపు పంట సాగు కోసం అప్పులు తెచ్చిన రైతులకు రుణదాతల నుంచి ఒత్తిళ్లు అధికమయ్యాయి. పరిహారం ఎప్పుడిస్తారు అయ్యా అని ఫారెస్టు బీట్ అధికారులను అడుగుతుంటే ముఖం చాటేస్తున్నారని బాధిత రైతులు వాపోతున్నారు. బాధిత రైతులు అధికారుల వద్దకు వెళ్లి అడిగితే.. ఆరు నెలలు పట్టొచ్చు.. సంవత్సరం పట్టొచ్చు అని నిర్లక్ష్యంగా సమాధానాలు ఇస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దళవాయిపల్లి, తాళ్ల మడుగు, మాదిరెడ్డిపల్లి, తెల్లరాళ్లపల్లి, భూమిరెడ్డి పల్లి, పత్రపల్లి, కాశిరాల్ల గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంటలను ఏనుగులు దాడి చేసి బీభత్సం సృష్టించాయి. ఇందుకు ప్రభుత్వం నుంచి బాధిత రైతులకు రూ.లక్షల్లో రావాల్సి ఉంటుంది.

వైద్య ఖర్చులకూ మొండిచెయ్యే..

ఈ ఏడాది మార్చి 9వ తేదీన రాత్రి దళవాయిపల్లికి చెందిన మణి కుమారుడు ఉమాపతి(21) బైక్‌లో వెళ్తుండగా ఒంటరి ఏనుగు దాడి చేసింది. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన ఉమాపతి తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందాడు. అయితే వైద్య చికిత్సలకు కుటుంబ సభ్యులు దాదాపు రూ.రెండు లక్షలు వరకు అప్పు చేశారు. నాడు సంబంధిత అధికారులు చికిత్సకు అయ్యే మొత్తాన్ని నష్ట పరిహారంగా ప్రభుత్వం నుంచి అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. కానీ నేటి వరకు ఇవ్వకపోవడంతో తెచ్చిన అప్పులకు వడ్డీలు చెల్లించలేక ఆ నిరుపేద రైతు కుటుంబం ఇబ్బందులు పడుతోంది. ఇప్పటికీ వైద్యం కోసం ప్రతి నెలా రూ.10 వేల వరకు ఖర్చు అవుతోందని బాధితుడి తండ్రి కన్నీటి పర్యంతం అవుతున్నాడు. రిపోర్టులు ఇచ్చిన 3 నుంచి 5 రోజుల్లో పరిహారం డబ్బులు తమ ఖాతాలో పడుతాయని అధికారులు చెప్పినా.. ఇప్పుడు నెలలు గడుస్తున్నా అందకపోవడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పక్క మండలాల్లో అందించి.. ఇక్కడ మాత్రం.. !

ఇతర మండలాల్లో పంటలు నష్టపోయిన బాధితులకు పరిహారం అందించడంలో చొరవ చూపిన అధికారులు యాదమరి మండలానికి వచ్చేసరికి తాత్సారం చేస్తున్నారని బాధిత రైతులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా సంబంధిత అటవీశాఖ అధికారులు స్పందించి ఏనుగు బాధితులకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని, లేకుంటే జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగుతామని బాధిత రైతులు హెచ్చరిస్తున్నారు.

ఇంకా ఎన్ని నెలలు నిరీక్షించాలి



ఆరుగాలం తాము కష్టించి సాగు చేసిన పంటలను ఏనుగులు ధ్వంసం చేశాయి. ఏనుగుల నియంత్రణకు గట్టి చర్యలు తీసుకోవడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. ఇస్తామన్న నష్టపరిహారం అందించడంలోనూ జాప్యం చేస్తున్నారు. ఇంకా ఎన్ని నెలలు పరిహారం కోసం ఎదురు చూడాలో అర్థం కావడం లేదు. –రామయ్య, నష్టపోయిన రైతు, మాదిరెడ్డిపల్లి

రైతులంటే ఇంత నిర్లక్ష్యమా ?



రైతులంటే ప్రతి ఒక్కరికీ అలుసుగా మారింది. అన్నదాతలను ఇబ్బందులకు గురిచేయడం శ్రేయస్కరం కాదు. రైతులకు అండగా ఉండాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం చాలా బాధాకరం. పరిహారం కోసం ఎన్నాళ్లు తిరగాలి? –హరనారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ, ముద్దురామాపురం

కాళ్లరిగేలా తిరుగుతున్నా..



మా రైతులకు న్యాయం చేయాలని అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా కార్యభంగమే తప్ప ఫలితం శూన్యం. మా బాధ ఎవరికి చెప్పుకోవాలి. మా వ్యథలు పగవారికి కూడా రాకూడదు. మా రైతన్నలకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోము. –రవీంద్రబాబు, వైస్ ఎంపీపీ, దళవాయిపల్లి

ఆర్థికంగా నలిగిపోయాను



ఆరుగాలం కష్టించి సాగుచేసిన పంట ఏనుగులు పాలైంది. ఆర్థికంగా అండగా ఉంటాడని అనుకున్న ఒక్కగానొక్క కొడుకుని ఒంటరి ఏనుగు తీవ్రంగా గాయపరచింది. వైద్య ఖర్చుల కోసం అప్పులు చేశాను. పరిహారం ఇంకా ఇవ్వకపోవడంతో వడ్డీలు కట్టలేక ఆర్థికంగా నలిగిపోయాను. –మణి (ఏనుగు దాడిలో గాయపడిన ఉమాపతి తండ్రి), దళవాయిపల్లి

క్లుప్తంగా

బాట గంగమ్మకు ప్రత్యేక పూజలు



పొంగళ్లు తీసుకెళ్తున్న మహిళలు

ఐరాల: పూతలపట్టు మండలం తేనేపల్లె గ్రామ దేవత బాట గంగమ్మకు మండలంలోని చిన్న వెంకటంపల్లె దళితవాడ గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం తమ గ్రామంలోని నడివీధి గంగమ్మకు పసుపు, కుంకుమ, సుగంధ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. అనంతరం జూలై మాసంలో తమ గ్రామంలో నడివీధి గంగమ్మకు ప్రత్యేక పూజలు చేసి గ్రామం నుంచి బాట గంగమ్మకు సారె, పొంగళ్లు సమర్పించడం ఆనవాయితీగా వస్తోందని చెప్పారు.

ఎర్రమట్టి తవ్వకాలపై సిట్ విచారణ చేయాలి

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో జరుగుతున్న ఎర్రమట్టి తవ్వకాలపై జిల్లా కలెక్టర్ సిట్ ఏర్పాటు చేసి విచారణ చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు, జిల్లా కార్యదర్శి నాగరాజన్ డిమాండ్ చేశారు. జీడీ నెల్లూరు నియోజకవర్గం పాలసముద్రం మండలంలో గత కొద్ది రోజులుగా అక్రమంగా కొండలు తవ్వి ఎర్రమట్టిని పక్క రాష్ట్రం తమిళనాడుకు తరలిస్తున్నారని తెలిపారు. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడాన్ని వారు విమర్శించారు. పాలసముద్రం మండలం సాయినగర్, ఎస్ఆర్ఆర్ కండ్రిగ, వనదుర్గాపురం తదితర గ్రామ పరిసరాల్లో కొండల్లో హిటాచీల ద్వారా వందలాది టిప్పర్ల ఎర్రమట్టిని తరలిస్తున్నట్లు మీడియా చానళ్ల ద్వారా వెలుగులోకి వస్తోందన్నారు. అధికార పార్టీ నేతలు చేస్తున్న అక్రమాలు వార్తల్లో వస్తున్నా కూడా అధికారులు చర్యలు తీసుకోకపోవడం సరికాదన్నారు. వీటిపై ఆధారాలతో సహా స్థానిక అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు.

మామిడి రైతులను దెబ్బకొట్టిన ప్రభుత్వం

- జిల్లా జెడ్పీ వైస్‌చైర్మన్ ధనుంజయరెడ్డి



యాదమరి: కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడదామని జెడ్పీ వైస్ చైర్మన్ ధనుంయరెడ్డి పార్టీ నేతలకు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన యాదమరిలో విలేకరులతో మాట్లాడారు. కూటమి ఏడాది పాలనలో ప్రజలకు లబ్ధి చేకూర్చిందేమీ లేదన్నారు. ఈ ప్రభుత్వం గతంలో మునుపెన్నడూ లేనివిధంగా మామిడికి గిట్టుబాటు ధర అందించక మామిడి రైతులను కోలుకోలేని దెబ్బకొట్టిందని ఆరోపించారు. సీఎం చంద్రబాబు సొంత జిల్లా అయిన చిత్తూరులో మామిడి రైతులు రోడ్డెక్కి ఆందోళనలు వ్యక్తం చేస్తుంటే కనీసం వారిని ఆదుకునే ప్రయత్నం చేయకపోవడం బాధాకరమన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మామిడి రైతులకు అండగా నిలిచిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సురేష్‌బాబు, వైస్ ఎంపీపీ రవీంద్రబాబు, మనోహర్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు కోనాపల్లి మనోహర్, కబీర్ బాషా, పెరుమాళ్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్యపరీక్షలు

తవణంపల్లె: గర్భిణులు మంచి పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉండగలరని వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు తెలిపారు. శుక్రవారం మండలంలోని ఎగువమత్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గర్భిణులు రక్తహీనత బారిన పడకుండా ఐరన్ మాత్రలు వాడాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారం బాగా తీసుకోవాలని సూచించారు. గర్భిణి ఆరోగ్యంగా ఉంటే పుట్టే బిడ్డ కూడా ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి



నిరసన తెలుపుతున్న ఆర్టీసీ కార్మికులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేలా చూడాలని ఈయూ (ఎంప్లాయీస్ యూనియన్) నాయకులు డిమాండ్ చేశారు. చిత్తూరు నగరంలోని ఆర్టీసీ –డిపో గేటు ఎదుట వారు శుక్రవారం ధర్నా నిర్వహించారు. పదోన్నతులకు వెంటనే అనుమతులు ఇవ్వాలని, అలాగే ఆర్టీసీ ద్వారా విద్యుత్ బస్సులను నిర్వహించాలన్నారు. ఖాళీలను వెంటనే భర్తీ చేయడంతో పాటు కొత్త బస్సులను కొనుగోలు చేయాలని కోరారు. ఉద్యోగ భద్రత సర్క్యులర్‌ను యథావిధిగా అమలు చేయడంతో పాటు ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. రిటైర్డు ఉద్యోగులకు చెల్లించాల్సిన గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్లు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వీఎస్ మణి, మురళీధరన్, చలపతి, మురళి, పార్తీబన్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చౌక దుకాణం తరలింపు అన్యాయం



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న పుల్లూరు గ్రామస్తులు

ఐరాల: మా ఊర్లో ఉన్న చౌక దుకాణన్ని పక్క గ్రామానికి తరలించడం న్యాయం కాదని పుల్లూరు, పుల్లూరు దళితవాడ గ్రామస్తులు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ.. తమ గ్రామంలో 30 ఏళ్లుగా చౌక దుకాణం ఉందని, గ్రామానికి చెందిన డీలర్ వేలనాథం అందుబాటులో ఉంటూ సక్రమంగా నిత్యావసర సరుకులు అందజేసేవాడన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత స్థానిక టీడీపీ నేతలు అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి తమ గ్రామానికి చెందిన డీలర్‌పై 6ఏ కేసు పెట్టించి డీలర్ షిప్‌ను రద్దు చేసినట్లు వాపోయారు. దీంతో డీలర్ హైకోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారని చెప్పారు. అయితే అధికారులు తమ గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో వీఆర్‌ఓ యల్లప్ప ఆధ్వర్యంలో కార్డుదారులకు నిత్యావసర సరుకులు అందించేవారని తెలిపారు. కాగా ఈ నెల రేషన్ సరుకులు తమ గ్రామ పంచాయతీ కార్యాలయంలో కాకుండా పక్క గ్రామమైన పీ.ఒడ్డుపల్లెలో దింపడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పుల్లూరు, పుల్లూరు దళితవాడలో 284 మంది కార్డుదారులు అక్కడికెళ్లి సరుకులు తీసుకోవాలంటూ నరకం అనుభవించాల్సి వస్తుందని వాపోయారు. పీ.ఒడ్డుపల్లెలో 33 మంది కార్డుదారులు మాత్రమే ఉన్నారని తెలిపారు. ఈ విషయంపై ఆర్డీఓ, కలెక్టర్‌కు సోమవారం వినతి పత్రం అందజేస్తామన్నారు. అనంతరం తహసీల్దార్ లోకేశ్వరికి వినతి పత్రం అందజేశారు.

ఇచ్చిన అప్పు అడిగినందుకు దాడి

చౌడేపల్లె: అప్పుగా ఇచ్చిన సొమ్మును తిరిగి ఇవ్వాలని అడిగినందుకు తనపై దాడిచేశారని పరికిదొనకు చెందిన మల్లికార్జున వాపోయారు. ఆయన శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన కథనం మేరకు.. పరికిదొనకు చెందిన మల్లికార్జున అదే గ్రామానికి చెందిన శివకు కొద్దిరోజుల క్రితం రూ.2700 అప్పుగా ఇచ్చాడు. ఎంతకూ డబ్బు తిరిగి ఇవ్వలేదు. తనకు అవసరాలు ఉన్నాయని, తీసుకున్న అప్పు ఇవ్వాలని శివను కోరాడు. ఆగ్రహం చెందిన అతను తన స్నేహితులతో కలిసి మల్లికార్జునపై దాడి చేశాడు. గాయపడిన అతన్ని కుటుంబ సభ్యులు పుంగనూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

వేర్వేరు కేసుల్లో ముగ్గురి అరెస్ట్

పుంగనూరు (చౌడేపల్లె): మండలంలోని అడవినాథుని కుంట వద్ద జరిగిన వేర్వేరు ఘటనల్లో ముగ్గురిని అరెస్ట్‌చేసినట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఈ నెల 2న క్రికెట్ ఆడేందుకు వెళ్లిన మహేంద్రరెడ్డిపై అడవినాథునికుంటకు చెందిన మోహన్‌కృష్ణారెడ్డి, కృష్ణారెడ్డి దాడి చేసి గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు మోహన్ కృష్ణారెడ్డి, కృష్ణారెడ్డిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలి పారు. అడవినాథునికుంటకు చెందిన జ్యోతి ఇంట్లో ఉండగా మహేంద్రరెడ్డి స్నేహితుడు మహేష్‌బాబు దాడికి పాల్పడ్డారు. జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మహేష్‌బాబును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

అమ్మవారి నగలు, తాళిబొట్టు చోరీ

బైరెడ్డిపల్లె: మండలంలోని పలమనేరు–కుప్పం జాతీయ రహదారిలో వున్న బైరెడ్డిపల్లె బాటగంగమ్మ ఆలయంలో గురువారం రాత్రి దొంగలు పడ్డారు. అమ్మవారి నగలు, తాళిబొట్టు చోరీకి పాల్పడ్డారు. శుక్రవారం ఉదయం ఆలయానికి వచ్చిన అర్చకులు తాళాలు పగులగొట్టి నగలు చోరీ చేసిన విషయాన్ని గుర్తించి స్థానికులు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. అమ్మవారికి అలంకరించిన 20 గ్రాముల బంగారు గొలుసు, 5 తాళిబొట్లు చోరీకి గురైనట్టు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.



బైరెడ్డిపల్లె ఆలయం వద్ద చోరీ వివరాలు సేకరిస్తున్న పోలీసులు

వానరానికి దాహం వేసి..

జూలై మాసం వచ్చినా ఇంకా వేసవి తాపం, ఉష్ణోగ్రతలు తగ్గలేదు. దీంతో జనం ఉక్కపోతను భరించలేకపోతున్నారు. మూగజీవాల పరిస్థితి చెప్పనక్కర్లేదు. గుడిపాలలో ఎండవేడిమి తాళలే క వానర సమూహం శుక్రవారం ఓ మినీ ట్యాంక్ వద్ద కొళాయిని తిప్పుకుని మరీ దాహం తీర్చుకుంది. ఈ దృశ్యాలను సాక్షి క్లిక్‌మనిపించింది. - గుడిపాల



దాహం తీర్చుకునేందుకు నీటి కొళాయి వద్ద ఓ వానరం పాట్లు

స్వామి వివేకానందకు నివాళి

చిత్తూరు కార్పొరేషన్: స్వామి వివేకానందుని వర్ధంతి సందర్భంగా శుక్రవారం నగరంలోని వివేకానంద విగ్రహం వద్ద పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకులు చిట్టిబాబు మాట్లాడుతూ రామకృష్ణ పరమహంస శిష్యుడు, వేదాంత యోగతత్వ శాస్త్రాల్లో సమాజంపై అత్యంత ప్రభావం చూపిన గొప్ప ఆధ్యాత్మికవేత్త వివేకానందుడు అని కొనియాడారు. దేశంలో రామకృష్ణ పరమహంస మఠాన్ని స్థాపించి యువతకు దిశా నిర్దేశం చేశారన్నారు. వివేకానందుడు చేసిన సేవలకు గుర్తుగా ప్రభుత్వం ఆయన జన్మదినాన్ని జాతీయ యువజన దినోత్సవంగా ప్రకటించిందన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ పవన్ కుమార్, అడ్వొకేట్ విజయ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదవండి



విద్యార్థులకు సూచనలిస్తున్న ఎంఈఓ హేమలత

తవణంపల్లె: మండలంలోని అరగొండ బాలికల ఉన్నత పాఠశాలలో పరిశుభ్రత పాటించాలని ఎంఈఓ హేమలత తెలిపారు. శుక్రవారం ఆమె అరగొండ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు విధిగా ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. తల్లికి వందనంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. పదో తరగతి విద్యార్థినులు క్రమశిక్షణతో చదివి వందశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఎంఈఓ వెంట హెచ్ఎం మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు

తవణంపల్లె: మండలంలోని టి.పుత్తూరులో వెలసిన పురాతన శ్రీ కోదండరాముల దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలు నేటి నుంచిప్రారంభం అవుతున్నాయి. శనివారం నుంచి ఈ నెల 19వ తేదీ వరకు నిర్వహించే ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను ఉభయదారులు, స్థానికులు, పరిసర గ్రామాల ప్రజల సహకారంతో ఘనంగా నిర్వహిస్తామని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త సిద్ధేశ్వర రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా శనివారం ఉదయం సీతారామలక్ష్మణులు, ఆంజనేయస్వామికి తిరుమంజనం, పాలాభిషేకం, మహాద్వార పూజ, సాయంకాలం అంకురార్పణ శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు

బ్రహ్మోత్సవాల్లో ప్రత్యేక కార్యక్రమాలు..

- 15న మంగళవారం ఉదయం స్వామివారికి సుప్రభాతం, తిరుమంజనం, పాలాభిషేకం, సాయంకాలం ఊంజల్ సేవ, రాత్రి సూర్యప్రభ వాహనసేవ
- 16న ఉదయం తిరుమంజనం, పాలాభిషేకం, ఊంజల్ సేవ, రాత్రి చంద్ర ప్రభ వాహన సేవ
- 17న ఉదయం తిరుమంజనం, పాలాభిషేకం, సాయంకాలం ఊంజల్ సేవ, రాత్రి పుష్పపల్లకి సేవ
- 18న తిరుమంజనం, పాలాభిషేకం, సాయంకాలం ఊంజల్ సేవ, రాత్రిలో కల్పవృక్ష వాహన సేవ, 19న శనివారం ఉదయం స్వామికి తిరుమంజనం, పాలాభిషేకం, సాయంకాలం ఊంజల్ సేవ, రాత్రి తెప్పోత్సవం జరుగుతుంది.

పోలీసు కుటుంబాలకు ఆర్థిక సాయం



మాధవికి చెక్కు అందిస్తున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్: పోలీసు శాఖలో పనిచేస్తూ మృతి చెందిన పలువురు ఖాకీల కుటుంబాలకు ఎస్పీ మణికంఠ శుక్రవారం ఆర్థిక సాయం అందజేశారు. ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీన అనారోగ్యంతో మృతి చెందిన ఎస్ఆర్ పురం స్టేషన్ కానిస్టేబుల్ ఆనంద్ బాబు కుటుంబానికి అండగా నిలుస్తూ ఆయన సతీమణి మాధవికి, గుడుపల్లెలో పనిచేస్తూ అదే నెల 23వ తేదీన చనిపోయిన కానిస్టేబుల్ లక్ష్మీ కుటుంబానికి గానూ ఆమె భర్త హరీష్‌కు కార్పస్ ఫండ్ నుంచి రూ.లక్ష చొప్పున చెక్కులు పంపిణీ చేశారు. అలాగే జూన్ 21వ తేదీన చిత్తూరు స్పెషల్ బ్రాంచ్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తూ చనిపోయిన మురళీకృష్ణ కుటుంబానికి అండగా నిలుస్తూ ఆయన భార్య మల్లీశ్వరికి రూ.లక్ష చెక్కు అందించారు.

వైఎస్సార్‌సీపీ మండల కమిటీ ఏర్పాటు

ఐరాల: వైఎస్సార్‌సీపీ ఐరాల మండల కమిటీలో పలువురికి చోటు కల్పించింది. అందుకు సంబంధించి పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ప్రకటన విడుదల చేసింది. ఐరాల మండల వైఎస్సార్‌సీపీ ఉపాధ్యక్షులుగా ఎన్.గుణభూషన్ రెడ్డి, జి.తిరుమలయ్య, జనరల్ సెక్రటరీలుగా జి.రవీంద్ర రెడ్డి, ఎన్.సురేంద్రరెడ్డి, బి.ఉమామహేశ్వర్ రెడ్డి, టి.త్రినాథ్, సెక్రటరీలుగా వి.శేషాద్రి, జి.మూర్తి, దీపక్‌కుమార్ రెడ్డి, బి.మునస్వామి రెడ్డి, ఎల్.గోపాల్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా జి.రాజారెడ్డి, కె.సురేంద్రరెడ్డి, జి.కేశవులు, ఎన్.హరిప్రసాద్, ఇ.రమేష్, పి.మోహన్, ఎస్.శేఖర్, పి.బాబురెడ్డి, కె.కిషోర్ కుమార్, కె.శ్రీనివాసులు రెడ్డి, జి.మల్లికార్జున, జె.గణపతిరెడ్డి, సి.అశోక్, ఆర్.హరిప్రసాద్, డి.సుధాకర్ నాయుడు, కె.రోహిత్, ధనశేఖర్ నాయుడు, ఆర్.కుమార్‌స్వామి నాయుడు, ఎం.భానుయాదవ్, కె.బాబు, కె.విజయసింహారెడ్డి, సి.రఘు, ఆర్.యోగానంద, పురుషోత్తం రెడ్డి, ఎన్.గురుమూర్తి రెడ్డి, ఎన్.వేణుగోపాల్ రెడ్డి, జి.సురేష్‌ను నియమించారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



బంగారుపాళెం జూనియర్ కళాశాలలో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

బంగారుపాళెం: విద్యార్థులు తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందని పీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వందనాత్రిపాఠి అన్నారు. శుక్రవారం కళాశాలలో విద్యార్థులకు తుంబకుప్పం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి ఆధునిక సమాజంలో యువత ఎక్కువగా ఫాస్ట్‌ఫుడ్ కల్చర్‌కు అలవాటు పడి అనారోగ్యాల పాలవుతున్నారని తెలిపారు. చైనీస్ వంటకాల రుచికి అలవాటు పడి ఇబ్బందులు తెచ్చుకుంటున్నట్లు చెప్పారు. రోడ్ల పక్క అమ్మే ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఆహారపు అలవాట్లను మార్చుకుని, రోజూ వ్యాయామం ద్వారా తమ ఆరోగ్యాలను జాగ్రత్తగా కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి మురళి, అధ్యాపకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యారంగం బలోపేతానికి యూటీఎఫ్ కృషి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఐరాల: ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఏకాంబరం డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో మండల యూటీఫ్ కార్యవర్గ సమావేశాన్ని అధ్యక్షుడు దేవరాజులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా యూటీఎఫ్ అధ్యక్షుడు మాట్లాడుతూ ఉపాధ్యాయులు తల్లిదండ్రులతో మమేకమై పిల్లల నమోదు పెంపొందించి ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం పీఆర్‌సీ కమిటీని వెంటనే నియమించి, ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. దేవరాజులు మాట్లాడుతూ ప్రభుత్వ బడులను కాపాడుకోవాలని, వంద శాతం నమోదు కార్యక్రమాన్ని చేపట్టాలని తెలిపారు. మండల యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ యూటీఎఫ్ ఎల్లప్పుడూ పోరాట స్ఫూర్తితో ఉపాధ్యాయులకు అండగా ఉంటుందని, టీచర్లంతా యూటీఎఫ్ సభ్యులుగా నమోదు చేసుకోవాలని కోరారు. అనంతరం ప్రభుత్వ విద్యారంగ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

అల్లూరి అడుగుజాడల్లో నడుద్దాం



బహుమతులు అందుకున్న విద్యార్థులు

బంగారుపాళెం: స్వాతంత్ర్య పోరాట యోధుడు అల్లూరి సీతారామరాజును విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని ఎగువ రాగిమానుపెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం నాగమణి అన్నారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో అల్లూరి సీతారామరాజు 129వ జయంతిని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూజలు చేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరంలో సీతారామరాజు పోరాటం మరువలేనిదన్నారు. భారతదేశం నుంచి ఆంగ్లేయులను తరిమి కొట్టడంలో అల్లూరి అలు పెరుగని పోరాటం చేశారని గుర్తు చేశారు. విద్యార్థులు అల్లూరిని స్ఫూర్తిగా తీసుకుని సమాజంలో జరిగే దురాగతాలను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. యువతతోనే సమాజం అభివృద్ధి సాధ్యమన్నారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.